

శ్రీ సువర్చలాంజనేయస్వామి దేవస్థాన ధర్మకర్తలు
శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్, శ్రీమతి ప్రభావతి దంపతులు





# శ్రీ సువర్చలేశ్వర శతకము

**1.** **శ్రీరమసీతకాగ హరి శ్రీరఘురాముడు కాగ శేషుడున్**
**గారవమొప్పలక్ష్మణుడు కాగ తదీయ పదారవిందముల్**
**తోరపుభక్తి సంపదలతో పరితోష సమన్వితుండవై**
**చేరి భజించునట్టి చిరజీవివినీవె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! (ఆంజనేయా) శ్రీలక్ష్మి సీత అయ్యింది. శ్రీమహావిష్ణువు రాముడయ్యాడు. ఆదిశేషువు లక్ష్మణుడయ్యాడు. వారిపాదపద్మాలను భక్తితో పూజించే చిరంజీవివి నువ్వు.

**2.** **భ్రాజితమైన రామపద భక్తిని గైకొని నాడు లంకయం**
**దాజికి జంకనట్టి పరమాద్భుత శౌర్యము నీకరస్థమై**
**తేజమునింప రక్కసుల దేహములన్ వడి చీల్చినావులే**
**వ్యాజములేని భక్తికొనియాడుదు నిన్ను సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! శ్రీరాముని పదభక్తితో లంకలో యుద్ధానికి భయపడని పరాక్రమంతో రాక్షసులను చీల్చిచండాడినావు. వంకలేని భక్తితో నిన్ను ప్రశంసిస్తాను.

3. **పారములేని భక్తిగొని భవ్యమనస్కులు గబ్బిటాన్వయుల్**
**కూరిమి మీఅనీకునిట కోవెల గట్టిరి పుణ్యమూర్తులై**
**భారములేదులే ప్రజకు బాగుగ నీ కరుణా కటాక్షము**
**య్యూరునకందయై నిలిచెనోకపివర్య!సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! భక్తిభావాన్ని అందిపుచ్చుకొని 'గబ్బిట' వంశస్థులు నీకు ఇక్కడ దేవాలయాన్ని నిర్మించారు. నీకరుణాకటాక్షం ఉయ్యూరుకు అండగానిలిచింది.

4. **భారత సంహితన్ గడిగి వ్యాస మునీంద్రుదు పల్కుచుండగా**
**తారహిదంతమున్ బెరకి తత్పరతన్ విరచించినట్టి సం**
**స్కారుని ఆదిపూజ్యుని ప్రసన్న కవిత్వ పటుత్వ శక్తికై**
**సారెకు భక్తి మీఅగిరిజాసుతునెంతు సువర్జలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! వ్యాసుడు పలుకుతుంటే తనదంతంతో భారతాన్ని రచించినట్టి ఆదిపూజ్యుడైన వినాయకుణ్ణి ప్రసన్న కవిత్వం కోసం ప్రార్థిస్తాను.

5. **వన్యమహాన్వయాబ్ధిశశి భాసుర మంగళ పూర్వభాద్రలో**
**మాన్యులు మెచ్చ పుట్టితివి మాటలకందని వాడవై అసా**
**మాన్యుడవై రఘూద్వహుని మానసమున్ హరియించినావు, కౌం**
**డిన్యసగోత్ర! మారుతి! కడిందినుతింతు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! పూర్వభాద్ర నక్షత్రంలో పుట్టావు. అసాధ్యుడవై రాముని చిత్తాన్ని హరించావు. కౌండిన్య గోత్రా! నిన్నుస్తుతిస్తాను.

6. **ఘోరకిరాతశాత పరిగుంభిత బాణము క్రౌంచపక్షినిన్**
**ధారుణి కూల్చివేయ పరితాపమనస్కత పుట్టపట్టి క**
**న్నీరును కార్చెనత్తఱిని నేర్పుగ శ్లోకమునుద్భవించి; చె**
**న్నారగ మేటిరామకథకాయువుపోసె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! ఘోరకిరాతుని బాణముక్రౌంచపక్షిని నేలకూల్చగా దు:ఖంతో వాల్మీకి మహర్షి కన్నీరు కార్చాడు. ఆ సమయంలో మావిషాద శ్లోకం ద్భవించి, రామకథకు ప్రాణం పోసింది.

7. **సారవచో విలాసములు సారెకు సారెకు సందడింపగా**
**కూరిమి రామలక్ష్మణులకున్ ముదమున్ గలిగించి మీదటన్**

**ఆరవి పుత్రుతో జెలిమి హ్లాదమునింప ఘటించినాడవా**
**ధారము చిక్కెరామునకు దైన్యమువోవ సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! చక్కని సంభాషణా చాతుర్యంతో రామలక్ష్మణులకు సంతోషాన్ని కల్గించావు. సుగ్రీవునికి,రామునికి మైత్రికుదిర్చావు. రామచంద్రునికి ఆధారం చిక్కింది.

**8.** **వానరవీర! నీవలన భానుకులేశునకార్తితీరె; వి**
**జ్ఞాన విహార! నీవలన జానకి వేదన మంతరించె; అ**
**జ్ఞాన విదూర! నీవలన స్వాస్థ్యము దక్కెసుమిత్ర సూతికిన్**
**దీనశరణ్య! నీబలిమి తెల్పవశమ్మె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీ వలన రామునికి బాధతీరింది. నీ వలన సీతకు దు:ఖం అంతరించింది. నీ వలన లక్ష్మణుడికి ఆరోగ్యం దక్కింది.

**9.** **ప్రాణమునిల్పునట్టియలవాయుకుమారుడవంట విశ్వక**
**ల్యాణ గుణాభిరాముడగు రామునికెన్నగ బంటువంట; గీ**
**ర్వాణులు మెచ్చినట్టి యరి భంజన శీలుడవంట వానర**
**శ్రేణికి నేతవంట దరి జేర్చుము మమ్ము సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! ప్రాణాల్ని నిలబెట్టే వాయుపుత్రుడవు. రాముని బంటువి. శత్రువులను నిర్జించేవాడివి. వానరులకు నాయకుడవు. మమ్మల్ని ఉద్ధరింపుము.

**10.** **స్థిరమతి ధర్మదేవత ధృతిన్ నడయాడ ధాత్రిపైని; సుం**
**దరవదనారవిందుడయి తద్ధరి తోలగ వారువంబులన్**
**వరముగదిగ్జయంబలర పాండవమధ్యము తేరిటెక్కెమై**
**నిరుపమ సత్కృపాగరిమ నిల్చితివయ్య సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! భూమీమీద ధర్మదేవత నడిచేటట్లుగా శ్రీకృష్ణుడు గుఱ్ఱాలనుతోలగా, దిగ్విజయం ఒప్పేటట్లుగా అర్జునుని రధానికి జండాపై నిలిచావు.

**11.** **ఎందరులేరు వీరులు మరెందరు లేరు కపీంద్రులత్తతిన్**
**పొందగ సంద్రమున్ గడచి భూమిసుతన్ గనులారగాంచి, ము**
**న్ముందుగ వచ్చునట్టికపిపుంగవుడీవెయటంచు నమ్మిని**
**న్నందరు ప్రోత్సహించిరి మహాబలవంత! సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! ఎందరోవీరులున్నారు. కపిశ్రేష్టులున్నారు. సముద్రాన్ని దాటి సీతమ్మను చూచి ముందుగా వచ్చేటటువంటి కపిశ్రేష్టుడవు నువ్వే అని నమ్మి నిన్ను అందరూ ప్రోత్సహించారు.

**12.** **పూనిమహేంద్రపర్వతము పొందగనీబలిమిన్వహింపగా**
**వానరులెల్లఋన్ తగశుభమ్మని దీవెనలిచ్చుచుండ స**
**న్మానిత శైలరాజమును మానుగ ద్రొక్కినభమ్ముపైకి నెం**
**తేని జవంబుతోనె గురవేముదమార సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! మహేంద్ర పర్వతం నీ బలాన్ని భరింపగా వానరులు దీవెనలు ఇచ్చుచుండగా ఆ కొండను అణగద్రొక్కి పైకి ఎగిరావు.

**13.** **ఆకొనియుంటివో గగనమందుపిపాసకు చిక్కియుంటివో**
**ప్రాకటసత్కృతిన్ బొసగ పావని రమ్మని ఆదరింపమై**
**నాకుని త్రోసిపుచ్చివదనమ్మున నవ్వులు నివ్వటిల్లగా**
**వీక, పురోగమించితివి వీరవరేణ్య! సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! మేనాకుని స్వాగత సత్కారాన్ని త్రోసిపుచ్చి, ముందుకు పురోగమించావు.

**14.** **ఆయత జీవనాస్పదమహాంబుధి గోష్పదమయ్యెనీకు భ**
**ద్రాయతమూర్తి రాక్షసులు తారొకచోమశకంబులైరి; రా**
**మాయణమాలయందు చెలువారగ క్రాలెడు రత్నమీవె; సు**
**శ్రేయము దక్కునీభజన చేసిన మాకు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేష్వరా! సముద్రం నీకు గోష్పదమైంది. రాక్షసులు దోమలయ్యారు. రామాయణమాలలో ప్రకాశించే రత్నానివి నువ్వే.

**15.** **పావని శక్తియుక్తులును ద్వాపరమందు పరీక్షచేసి; ఆ**
**పావని మ్రొక్కనాతనిని భ్రాజిత సోదరభావ మేర్పడన్**
**శ్రీవరణీయ సత్కరుణచే బలవంతుని జేసినట్టి; ఓ**
**పావని నీకుమ్రొక్కుదునవారిత భక్తి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! ద్వాపరయుగంలో భీముణ్ణి పరీక్షించి, ఆతడిని సోదరభావంతో మహాబలవంతుణ్ణి చేశావు.

**16.** **ఆయత భద్రమూర్తి విభవాంచిత నిర్మల సాంద్రకీర్తిసు**
**శ్రేయము గల్గునీ భజన చేసిన భక్తజనాళికిద్ధరన్**
**నీయసమాన పాండితియు నీప్రభుభక్తి యనన్యమయ్యరా**
**మాయణకావ్యరాజమునకందమె నీవు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీ పాండిత్యము, నీ ప్రభు భక్తి అనన్యసామాన్యము రామాయణకావ్యానికి అందం నీవే.

**17.** **శ్రీరమయైనజానకిని జేరి రఘూద్వహుగాథనొక్కెడన్**
**కూరిమి జెప్పియాజనని గుండెలదాగిన వేదనాగ్నినా**
**సారవచో విలాసముల చల్లగ జేసినవాడనీవె మా**
**భారము స్వీకరింపు జనిబాధ తొలంగ సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రామకథను ఆలపించి, సీతహృదయాగ్నిని, వర్షాకాలం అనే వాగ్విన్యాసంతో చల్లబరచినవాడవునీవే.

**18.** **సురుచిర వాయుమార్గమున శూరులు మెచ్చగ సూక్ష్మబుద్ధివై**
**శరనిధి నిర్గమించితివి సర్వమునీవశమై కపీశ్వరా**
**కరములు మోడ్చిమ్రొక్కినది కండలు పెంచిన వీరులైన నీ**
**చరణములంటి మ్రొక్కవలె సాహసవీర సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! వాయుమార్గంలో నువ్వు సూక్ష్మబుద్ధిలో సముద్రాన్ని దాటావు. సర్వనీకు వశమై నమస్కరించింది.

**19.** **సురచిరభావనాపటిమ సొంపెసలారగనంజనాసుతా**
**సురసనుకూల్చి యాపయిని శూరులు మెచ్చగ వేగ సింహికిన్**
**నెటిపరిమార్చిలంకజని నేర్పుగ, లంకిణి నేసి లోనికిన్**
**కరమనురక్తి, యేగతివి కార్యధురీణ! సువర్చాలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! భావనా బలంతో వరుసగా సురసను, సింహికను, లంకిణిని సంహరించి, లంకలోకి ప్రవేశించిన కార్యసాధకుడవు నువ్వే.

20. మాలిమి వీడి పక్షులను మాటున దాగి వధించు బోయయౌ
గాలవుడొక్కరుండు నవకమ్మున నీమహనీయ మంత్రమున్
హేలగతాజపించుచు మహీతల మందున సమ్మునీంద్రుడై
చాలగ కీర్తిగాంచె జని సార్థక మొంద సువర్చలేశ్వరా!

భావం : సువర్చలేశ్వరా! గాలవుడనే కిరాతకుడు నీ మంత్రాన్ని జపించి లోకంలో మహర్షిగా గొప్పకీర్తిని ఆర్జించాడు.

**21.** **జనకుని పుణ్యరాశి విలసద్రఘురాముని ధర్మపత్ని స**
**న్మని జనసేవితాఢ్య సురపూజ్యయశోధన సీతయట్టి సా**
**ధ్వని చెరపట్టి తెచ్చె ముని వేషము దాల్చి సురారి యక్కటా**
**గుణనిధి యామె జాడ కనుగొంటివి వహ్వ సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! జనకుని పుణ్యాల పంట. రాముని ధర్మపత్ని మునుల చేత సేవించబడేది. కీర్తిమంతురాలైన సీతను రావణుడు చెరపట్టి తెచ్చాడు. నువ్వామె జాడను కనిపెట్టావు.

**22.** **ననుగనుగప్పి పోవతగునాయిది సాధ్యమె సుంతయేమి నా**
**అనుమతి లేక యొక్కపురుగైనను లోనికి వెళ్ళదంచు లం**
**కిణిపలుకంగ దానినడగించి రయమ్మున లంక జొచ్చి సీ**
**తనుకనుగొన్న మేటివిగదా కపివీర సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నన్నుదాటి లోపలికి వెళ్ళలేవని అదలించిన లంకిణిని అణగద్రొక్కి లంకా ప్రవేశం చేశావు.

**23.** **నిరుపమ శేముషీగరిమ నీలుడు వారిధిపైని గట్టె అ**
**చ్చెరువొనగూర వారధిని శ్రీరఘురాముడు మెచ్చునట్లుగన్**
**శరములపైని బండలొక చక్కినదేమిటొ తేలిపోయె, నం**
**బరమె శిరమ్మువంచి కపివర్యుని మ్రొక్కె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రాముడు మెచ్చేటట్లుగా నీలుడు సముద్రంపై సేతువును నిర్మించాడు. బండరాళ్లు కూడా నీళ్లపై తేలిపోయాయి.

**24.** **ఎక్కడరామకీర్తనలు హేలగ భక్తులు పుణ్యభాగులై**
**చక్కగ పాడుచున్ భజన సల్పుదురో వినయాధికుండవై**
**అక్కడ నుందువంట కొనియాడగ శక్యమె నిన్ను మారుతీ**
**మ్రొక్కుదు నీపదాబ్జయుగమున్ నిరతంబు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! భక్తులు ఎక్కడ రామకీర్తనలు పాడుతూ భజన చేస్తుంటారో అక్కడ నువ్వుంటావు.

**25. అరయగరామనామ మధురామృత మానుచు పెక్కుకార్యముల్**
**హరివరవేయొనర్చితివి యబ్జభవాదులు ప్రస్తుతింపగన్**
**స్థిరమతి దూత కృత్యమును ధీయుతులెన్నగ సల్పినట్టి సుం**
**దరదరహాస భాసుర సుధానిధి నీవె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రామనామామృతాన్ని ఆస్వాదిస్తూ చాలా అద్భుత కార్యాలు చేశావు. పండితులు ప్రశంసించేవిధంగా దూతకృత్యాన్ని నిర్వర్తించావు.

**26. భూతపిశాచముల్ చెలగి భూజనులన్ భయపెట్టు వేళ సం**
**ప్రీతిగ నీదు దండకము వేమరుపాడగ పాతిపోవు రం**
**భాతరు సీమలందు ప్రతిభామయమూర్తి చరింతు వంటనీ**
**ఖ్యాతిని శేషుదైన కొనియాడ వశమ్మె సువర్చలనశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా ! భూతపిశాచాలు విజృభించి ప్రజల్ని బాధపెట్టేవేళ నీ దండకాన్ని పాడుకుంటే అవి పారిపోతాయి. అరటి తోటల్లో సంచరిస్తావు.

**27. రాతిని నాతిగా మలచె రాజిత శైవశరాసనంబువి**
**ఖ్యాతి తలిర్పగా విరిచె అన్నుల మిన్న ధరిత్రి పుత్రినిన్**
**బ్రాతిగ పెండ్లియాడె రిపువర్గము నెల్లెడ కూల్చె సజ్జన**
**వ్రాతము నాదరించె రఘురామవిభుండు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రాముడు రాతిని రాతిగా మార్చాడు. శివుని విల్లు విరిచి, సీతను పెండ్లాడాడు. శత్రువుల్ని నిర్జించాడు. సత్పురుషులను ఆదరించాడు.

**28. భానుని పండుగా దలచి బాల్యమునందున దాని నందుటన్**
**ఆననమెట్టబారె చతురానన ముఖ్యులు విస్తుబోవగన్**
**మానిత శక్తి సంపదలు మన్ననజేసెను చిన్ననాటనే**
**దానవ భంజనా! నిను ముదంబున గొల్తు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! సూర్యుణ్ణి పండుగా భ్రమించి బాల్యంలో దానిని పట్టుకోవడం వల్ల నీ మూతి ఎర్రబడింది. చిన్నప్పుడే అద్భుత శక్తులు నిన్ను ఆశ్రయించాయి.

**29. పావనసీత దగ్గఱకు వచ్చి యాదశకంఠుడుగ్రుడై**
**వావిరి కష్టపెట్టె పరపత్నిని బాధయొనర్ప చేటగున్**
**ఆవిరిబోణి దు:ఖము మహాగ్నివిధంబునరేగె దానికిన్**
**భావనసేయ నీ ప్రళయవాలమె సాక్షి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! సీతాదేవి దు:ఖం అగ్నిలా రగిలింది. దానికి ప్రళయకాలంలో అగ్ని స్వరూపమైన నీవాలమే (తోక) సాక్షి.

**30.** **సురచిరభావనాపటిమ సుందరకాండకు వన్నెలేర్పడన్**
**మురియగ సిద్ధసాధ్యముల్ శరవేగముతో సముద్రమున్**
**స్థిరమతిదాటి జానకిని జేరి శుభంకృత రామముద్రికన్**
**వరముగనంద జేసితివి వానరవీర సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! సుందరకాండకు వైభవం దక్కేట్లుగా సముద్రాన్ని దాటి, రామముద్రికను సీతాదేవికి అందజేశావు.

**31.** **మారుతి నీదు దర్శనము మాతకునెక్కుడ నాస్థపెంచె వి**
**స్తారనవ ప్రమోదములు స్వాంతమునందున చిందులాడెనొ**
**రా రఘురామచంద్రు కుశలమ్ములు మాటికి నాలకింపగా**
**చేరువయయ్యె సిగ్గునను చెక్కిలిపైని సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీ దర్శనం సీతాదేవిలో ఆశను పెంచింది. రాముని కుశలవార్తలు వింటుంటే ఆమె బుగ్గలు సిగ్గిల్లాయి.

**32.** **రాక్షసకాంతలందు నెలరాజును బోలెడు కాంతి మూర్తియై**
**దీక్షవహించినట్టి పరదేవత మిక్కిలి దీనవృత్తితో**
**రూక్షకటాక్షనేత్రయయి రూఢిగనున్నధరాకుమారినిన్**
**దక్షత గాంచినావు పరతత్వ విహార సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రాక్షసకాంతల మధ్యలో నెలరాజులా కాంతులు చిందిస్తూ మిక్కిలి దీనావస్థలో ఉన్న పరదేవత సీతామాతను చూసావు.

**33.** **నిన్నుస్మరియించువారలకు నిస్తులధైర్యము సంఘటిల్లెడిన్**
**నినువినుతించు వారలకు నిర్మల తేజము లగ్గలించెడిన్**
**నిను భజియించువారలకు నిశ్చల భావములందగించెడిన్**
**నినుమదిజేర్చి గొల్తు మహనీయ చరిత్ర సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నిన్ను స్మరిస్తే ధైర్యం వస్తుంది. నినుకీర్తిస్తే తేజస్సు కలుగుతుంది. నిన్ను ధ్యానిస్తే నిశ్చలత్వం ఏర్పడుతుంది.

**34. రాముడు లోక బాంధవుడు రాముడు శత్రువినాశకుండునా**
**రాముడు సన్మునిప్రకర రంజన శీలు దుదారచిత్తుడా**
**రాముడు సజ్జనావన కళానిరంతుడు శివార్చకుండు నా**
**రాముడు నీ మనోహరుడు ప్రాణసముండు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! లోబాంధవుడు, శత్రునాశకుడు, సజ్జన రక్షకుడు, శివార్చకుడైన రాముడు నీకుప్రాణం.

**35. ఉరుతర భక్తితో విజయుడొక్కడు నీ మహనీయ మంత్రమున్**
**స్థిరమతి నాలపించె నవజీవన భావనలుల్ల సిల్లనీ**
**దరిసెనమయ్యె నాతనికి త్వత్కృపనుత్తర జన్మమందునన్**
**హరిసఖుడై జనించె భువినావిజయుండు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! విజయుడనేవాడు నీ మంత్రాన్ని నిష్ఠతో జపించాడు. నీ దర్శనమైంది. నీ కృపవల్ల అతడు మళ్ళీ జన్మలో అర్జునుడుగా పుట్టాడు.

**36. తారకమంత్రమై కుటిల దానవ వంశ వినాశ తంత్రమై**
**శ్రీరఘురామపాద సరసీరుహ భక్తి నియంత్రమై వచ**
**స్సార విలాసమై నిఖిల శాస్త్రసుధారస భాండమైశుభా**
**కార!భవత్కృపాశయము, గాసినడంచె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీ ఆశయం తారక మంత్రమై, రాక్షసులను నాశనం చేసే ఉపాయమై, రామభక్తిని పాదుగొల్పేదై, శాస్త్రం అనే అమృతభాండమై దు:ఖాన్ని పోగొడుతుంది.

**37. మారుతతుల్య వేగుడవు మానసవేగుడవెన్నిచూడగా**
**శ్రీరుచిరార్థ ధీజన పరిష్కుడవద్భుత శక్తియుక్త వి**
**స్ఫారితవాయుపుత్రుడవు చల్లని రాముని సేవకుండవై**
**కీరితిగొన్న నీకెపుడు కేలునుమోడ్తు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! వాయువేగం, మనోవేగం, కలవాడివి. పండితులలో శ్రేష్ఠుడివి. వాయుపుత్రుడివి. రాముని సేవకుడవు.

**38. లీలగవిల్లునంది యువలీలగ శ్రీ రఘురామమూర్తి: ఆ**
**వాలిని గూల్చి రాజ్యమును బాగగనిచ్చెదినేశ సూతికిన్**

**ఆలవితాంతరంగునకు ప్రాణసమానుడైయఖండ కా**
**ర్యాలనొనర్చినట్టి కపిరాట్టువు నీవె సువర్చలేశ్వరా!**

భావము : సువర్చలేశ్వరా! రాముడు వాలిని కూల్చి సుగ్రీవుడికి రాజ్యాన్ని ఇచ్చాడు. ఆ రామునికి ప్రాణప్రదుడవై అఖండ కార్యాలను సల్పావు.

39. **భక్తిగనిన్నునా తమలపాకులతోడ సమర్చసేయు ధీ**
**శక్తిననుగ్రహింతువు ప్రసాదమునొక్కెడనారగింపగా**
**ముక్తినొసంగు చుందువుప్రఫుల్ల మన: పరిపాకయుక్తినా**
**సక్తిభజింపబంటువయి సాకుదువెప్డు సువర్చలేశ్వరా!**

భావము :సువర్చలేశ్వరా! తమలపాకులతో నిన్ను పూజిస్తే బుద్ధిబలాన్ని అనుగ్రహిస్తావు. నీ ప్రసాదాన్ని తింటే బంటుగా ఉండి కాపాడతావు

40. **గుండెలయందు రామునెలకొల్పిన నిక్కపుబంటువీవె కై**
**దండలనిచ్చుచుంటి భరతస్ఫుట నృత్యవినోదశీలి మా**
**కండగ నుండుమయ్య మహిమాన్విత నీ చరణారవిందముల్**
**దండిగ కొల్తు మయ్య హరిదాసులమయ్య సువర్చలేశ్వరా!**

భావము : సువర్చలేశ్వరా! రాముడికి నిజమైన సేవకుడవు నువ్వే. భరతనాట్యం అంటే నీకు ఇష్టం. నీ పాదపద్మాలను ఆరాధించే హరిదాసులం మేము.

41. **రామునికన్నమిన్నకద రామునినామముదాని నెప్పుడున్**
**ప్రేముడినాలపించెదవు వీడని భక్తిపరత్వమేర్పడన్**
**నీ మహనీయశక్తికదె నిల్చెను సొంతము జీవగఱ్ఱయై**
**రామునిపాదపద్మయుగళమ్మును గొల్తు సువర్చలేశ్వరా!**

భావము :సువర్చలేశ్వరా! రామునికంటే రామనామం గొప్పది. ఆ నామాన్ని భక్తితో పాడతావు. నీ శక్తికి అదే జీవశక్తి.

42. **పేరుకుకీశ జన్ముడవు వేదపురాణములభ్యసించి వి**
**స్తారయశమ్ము నందితివి చక్కదనమ్ముగ నంగదాదులున్**
**సారెకు సన్నుతింపగ వెసన్ గగనాన పురోగమించి నీ**
**వారికి మోదమిచ్చితివి వారినిదాటి సువర్చలేశ్వరా!**

భావము : సువర్చలేశ్వరా! పేరుకు వానరజన్ముడవు. వేదపురాణాలను అభ్యసించి గొప్ప కీర్తిని పొందావు. ఆకాశంలో పురోగమించి నీబంధు జనానికి సంతోషం

ఇచ్చావు.

43. **మరువతరమ్మె మేటి హనుమత్పురమెన్నగ ప్రశస్తమైనదా**
**పురమునకీడులేదు మునిముఖ్యులు వేదవిశారదుల్ మహీ**
**సురలటనుండగా పనిచి చూడవెవారిని కంటిరెప్పగన్**
**ధరమును నీకు దాశరథి దానినొసంగె సువర్చలేశ్వరా!**

భావము : సువర్చలేశ్వరా! సాటిలేని హనుమత్‌పురంలో వేదపండితులు, బ్రాహ్మణులు ఉండేటట్లుగా ఏర్పాటుచేసి, వారిని కంటికి రెప్పలా చూస్తావు.

44. **పండితులైనవారలకు పావనినీప్రతిభా విశేషముల్**
**మెండుగమోదమున్ గొలుపుమేలొన గూరగ రాయబారివై**
**దండితనమ్ముజూపితివిదానవధూర్తులు నిన్ను బట్టదో**
**ర్దండ పటుప్రహారముల దంచితివయ్య సువర్చలేశ్వరా!**

భావము : సువర్చలేశ్వరా! పండితులకు నీ ప్రతిభావిశేషములు ఆనందం గొలుపుతాయి. రాయబారిగా నీ తెలివితేటలను ప్రదర్శించావు.

45. **అమ్ములతోడ సేతువు మహాంబుధి పైని పృథాతనూజుడున్**
**నెమ్మినలంకరించి మహనీయ నినున్నడువంగ పంచెమొ**
**త్తమ్మది కూలిపోయె హరి తన్మయుడై తిలకించె క్రీడిగ**
**ర్వమ్మునడంచినట్టి బలవంతుడవీవె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! అర్జునుడు సముద్రం మీద సేతువు నిర్మించి నిన్ను నడవమన్నాడు. అది నీ బలానికి తట్టుకోలేక కూలిపోయింది. అర్జునికి గర్వభంగం చేసినట్టి బలవంతుడవు నువ్వే.

46. **భాసురమైన నీదుప్రభుభక్తికి నెల్లలు లేవు తెల్పగన్**
**వాసిగడించినావు ఘన భానుజ భక్తుడవై తలంప ని**
**స్త్రాస విలాస సంకలిత దానవమత్త కరీంద్ర పాళికిన్**
**కేసరి నీవెనిక్కమిది కేసరి పుత్ర సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీ భక్తికి ఎల్లలులేవు. రాక్షసులనే మదించిన ఏనుగుల గుంపుకు నువ్వు సింహానివి.

47. ఘనతరభీమరూపమును గైకొని వాయు పథాన వార్ధిలం
ఘనమొనరించినావు కనగా పృషదంశక మూర్తివై ధృతిన్
వినుతి వహింపగా దనుజ వీటికి నేగితివెంతవాడవో
అనితరసాధ్యమీ పనుల హర్పతి శిష్య సువర్చలేశ్వరా!

భావం : సువర్చలేశ్వరా! భీకరరూపం దాల్చి సముద్రాన్ని దాటావు. పిల్లి ప్రమాణం కల్గిన ఆకారాన్ని దాల్చి లంకలోకి ప్రవేశించావు.

48. భానునిజేరి వ్యాకరణపాఠము సాంతమెఱింగినావు ప్ర
జ్ఞానిధివై రఘూద్వహుని స్వాంతము నొక్కెడ దోచినావు వి
జ్ఞాన పయోధివై మిగు సాగర వారిని దాటి భూరి స
న్మానమునందకొన్న హనుమంతుడవునీవె సువర్చలేశ్వరా!

భావం : సువర్చలేశ్వరా! సూర్యుని దగ్గర వ్యాకరణం చదువుకున్నావు.నీ తెలివి తేటలతో రాముని హృదయాన్ని హరించావు. సముద్రం దాటి సన్మానమును అందుకున్నావు.

49. గురుకడిమిళ్ళ దీవెనల కోమల భారతి సత్కృపాస్థితిన్
వరముగ శబ్దముల్ పొసగ పద్యమరందరస ప్రవాహముల్ శుభం
కరముగ పొంగులెత్త శతకమ్మును నీపయి పల్కినాడ మే
దుర కరుణాంతరంగ గొను దోషమడంగ సువర్చలేశ్వరా!

భావం : సువర్చలేశ్వరా! గురువు శ్రీకడిమిళ్ళ శ్రీ భారతీ దేవి సత్కృపతో నీ మీద శతకం అల్లాను. పాపాలు పరిహారం అయ్యేటట్లుగా స్వీకరింపుము.

50. భారతజాతి పౌరుషము భారత సంస్కృతి సంప్రదాయముల్
భారతదేశ వైభవము పావనమైన సమైక్య మాధురీ
పూరము భక్తి తత్పరత పుణ్యనదీ నద తీర్థరాజముల్
ఏరికి నైన శక్యమగునే వివరింప సువర్చలేశ్వరా!

భావం : సువర్చలేశ్వరా! భారత జాతి పౌరుషం, సంస్కృతి సంప్రదాయాలు వైభవం సమైక్యం భక్తితత్పరత, నదులు, తీర్థాల గురించి చెప్పటం ఎవరికీ సాధ్యం కాదు.

**51.** **దారము తెచ్చి పూవులను దండగ నల్లి భవద్గళాన సా**
**మీరి, యలంకరించితిని మేనున పుల్కలు తొల్కరింపగన్**
**కోరికలుజ్జగించి నిను కూర్మిభజించితినయ్య భక్త మం**
**దారల, సత్కవిత్వమిడు ధన్యుడనౌదు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! దారం తెచ్చి పువ్వులను దండగా కూర్చి నీ కంఠంలో వేశాను. నిను ప్రార్థించాను. నాకు కవిత్వం ఇమ్ము.

**52.** **ఊరులలోనమేటి విభవోజ్వల కీర్తిగడించుకొన్న ఉ**
**య్యూరునకేది సాటితలయూచరె సర్వమమీతలంబునన్**
**సారవచో విలాసములు'చక్కెర' పల్కుల మేళవింపగా**
**కూరిమి సత్కవిత్వమొన గూర్పుమునాకు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! ఊరులలో ఉయ్యూరు చాలా గొప్పది. ఎవరైనా తలఊచుతారు. దీనికి సాటిలేదు. వాక్కులలో పంచదారను మేళవించే విధంగా చక్కని కవిత్వాన్ని ఇమ్ము. (ఉయ్యూరు చక్కెర ఫ్యాక్టరీ ప్రసిద్ధి పొందింది)

**53.** **గబ్బిట వంశ సంభవులు కందువ నీ చరణారవిందముల్**
**గొబ్బున కొల్చుచుండిరిదిగో ఘనభక్తిరసార్ద్ర చిత్తులై**
**అబ్బురమందనెల్లఋ మహాత్మ భవత్కరుణావిశేషమై**
**కబ్బమునల్లినాడ కలకండలు చేర్చి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! భక్తిభావంతో గబ్బిటవంశీస్థులు నీకు పూజలు చేస్తున్నారు. నీ కరుణా విశేషంతో ఈ శతకం రచించాను.

**54.** **ధారుణికన్యకావిభుని ధర్మముకాచెను సజ్జనావళిన్**
**ధారుణి కన్యకావిభుని ధర్మము గూల్చెనురావణాసురున్**
**తారకరామ మంత్రమును తత్పరతన్ జపియించుచుందువా**
**సారమునందజేయుమిక చక్కగ మాకు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రాముని ధర్మం సత్పురుషులను కాపాడింది. రాముని ధర్మం రావణాసురుణ్ణి కూల్చింది. ధర్మం = సత్యము, విల్లు

**55.** **అందముచిందివోవుతరళాక్షులు కొందరు వస్త్రహీనలై**
**కొందరు మద్యపానమున కొందరు రావణమందిరంబులో**

**సుందర సుందరీమణుల చూచిన గాని జితేంద్రియుండవై**
**పొందుగ సాగినావు మునుముందుకు నీవు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! కొందరు అందం చిందే అందమైన స్త్రీలు,కొందరు వస్త్రాలు లేకుండా కొందరు మద్యపానంతో ఉన్నారు. వారిని చూచి, చలించకుండా ముందుకు సాగిపోయావు.

**56.** **యాగమువోలె ఆత్మపరమాత్మలకున్ గమనీయమైన సం**
**యోగము కూర్పనెంచి విభవోజ్వల కంధిని దాటినావు స**
**ద్యోగము మీఱ, రక్కసులతో రణమున్ బొనరించినావు నీ**
**త్యాగమపూర్వమద్భుతమునై విలసిల్లె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! ఆత్మ(సీత)ను పరమాత్మ (శ్రీరాముడు) ను కలపటంకోసం సముద్రాన్ని దాటావు. రాక్షసులతో యుద్ధం చేశావు. నీ త్యాగం అపూర్వం అద్భుతం.

**57.** **భారములుండబోవు శనివారమునందున నిన్ను గొల్చి సిం**
**దూరు దాల్చు భక్తులకు దూరమగున్ శనిపీడ యట్టులే**
**సారవివేక సంపదలుసందడి చేయున వారితంబునౌ**
**ధీరగుణమ్ము కీర్తియును తేజము కల్గు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! శనివారం రోజున నిన్ను పూజించి సిందూరం ధరించే భక్తులకు శనిపీడ పోతుంది. వివేకసంపద, ధీరగుణము, కీర్తి, తేజస్సు కలుగుతాయి.

**58.** **పిన్నతనాన నీక్రియలు విస్మయమున్ కలిగించె నెంతయున్**
**మిన్నగనాటలాడుచు సుమీ, మునులన్ వడి బాధ పెట్టవే**
**వెన్నను దోచి నట్టియల వెన్నునికైవడి చిద్స్వరూపివై**
**మిన్నును తాకినావు కడిమిన్ బ్రకటించి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! బాల్యంలో నీ చేష్టలు ఆశ్చర్యం కల్గిస్తాయి. ఆటలాడుతూ మునులను బాధ పెట్టావు. కృష్ణుడిలాగా జ్ఞాన స్వరూపంతో ఆకాశానికి ఎగిరావు.

**59.** **రావణమందిరంబున ధరాసుతయుండుట కల్ల తత్సతిన్**
**పావన సీతగా దలచి భ్రాంతికి జిక్కితివంతలోనె మే**

**లావనితాశిరోమణిని యల్లయశోకవనమ్మునందు సం**
**భావనలీనగాంచితివి భావివిధాత సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రావణ మందిరంలో సీత వుండదు. మండోదరిని చూసి సీతగా భ్రమించావు. తేరుకొని అశోకవనంలో సీతను దర్శించావు. నువ్వే భవిష్యత్ బ్రహ్మవు.

**60. తనియగ నెల్లకాలమును తారకమంత్రము నాలపించుచున్**
**మునిజన సేవితుండవయి బుద్ధి విశేషముతోడ గంధమా**
**దనధరణీ ధరంబున సదానివసించుచునుందు వంట పా**
**వనకదలీవనమ్మచట ప్రాపువహింప సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! మునులు నిన్ను సేవిస్తుంటే తారక మంత్రాన్ని జపిస్తూ గంధమాదన పర్వతం దగ్గఱ ఉంటావు.

**61. నరులను చిన్నగా దలచె నాగరికమ్మిసుమంతలేని వా**
**నరులను లెక్కచేయక మనమ్మున గర్వము హద్దుమీఱగా**
**వరములు గోరెరావణుడు పంకజ గర్భుడు వానికయ్యెడన్**
**మరణము వ్రాసిపెట్టెనొక మర్త్యుని చేత సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నరులను చులకనగా భావించాడు. వానరులను లెక్కచేయలేదు. వరాలు కోరుకున్నాడు. కాని బ్రహ్మ ఒక మానవుని చేత మరణాన్ని వ్రాసిపెట్టాడు.

**62. మాసిన వస్త్రమున్ మరియు మ్లానత నొందిన మోముతీవియున్**
**బాసిన తేజమున్ బలుకు వాడిన పూల తీగయై**
**ఆ సరసీరుహాక్షి జనకాత్మజనొక్కెడ గాంచి భక్తివి**
**శ్వాసముతోడ పొంగితివి జన్మతరింప సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రావణుడి మాటకు పూలతీగలా వణిపోయిన జానకీదేవిని చూశావు.

**63. ఆపదలందు నీస్మరణ మత్యధికమ్ముగుధైర్యమిచ్చెడిన్**
**ప్రాపువహించు నీ భజన బాధలకీలలు మందువేళలన్**
**దీపమువోలె నీ కరుణ దీప్తులు నింపును కారుచీకటిన్**
**తాపవిదూర నీ చరణ దాసులమయ్య సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా!ఆపదల్లో నీస్మరణ ధైర్యాన్నిస్తుంది. బాధల్లో నీభజన అండగా నిలబడుతుంది. ని కరుణ కారుచీకట్లో దీపంలా వెలుగులు నింపుతుంది.

**64.** **పోడిమి వాక్పటుత్వమునుబుద్ధిబలమ్మును నిర్భయత్వమున్**
**పాడినరోగమున్ మరియు వాడిగలట్టి యగణ్య ధైర్యమున్**
**వేడుకనింపు కీర్తియును పేర్మిన జాడ్యము కల్గు నిన్నుకొం**
**డాడెడి వారికిన్ గపికులాంబుధి చంద్ర సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నిన్ను కీర్తించేవారికి వాక్పటుత్వం బుద్ధిబలం, నిర్భయత్వం, అరోగ్యం,ధైర్యం, అజాద్యం కలుగుతాయి.

**65.** **మనుగడనిచ్చునట్టి హనుమద్వ్రతమున్ గొనియాడ శక్యమే**
**మునురఘురాముడున్ బరమపూజ్యుడునై యొనరించి రావణున్**
**దునిమె నిజాంగనామణిని దోర్బలమున్ బ్రకటించి తెచ్చె కా**
**వున హనుమా భవద్వ్రతము పుణ్యకరంబు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రాముడు హనుమత్ వ్రతాన్ని ఆచరించి, రావణుణ్ణి సంహరించి సీతమ్మను తెచ్చాడు.

**66.** **ధారుణి దాసభక్తికి నిదర్శనమీవె సువర్చలేశ్వరా!**
**ధారుణి స్వామిభక్తికి నిదర్శనమీవె సువర్చలేశ్వరా!**
**ధారుణి బాహుశక్తికి నిదర్శనమీవె సువర్చలేశ్వరా!**
**ధారుణి ధైర్యశక్తికి నిదర్శనమీవె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! దాసభక్తికి, స్వామి భక్తికి, బాహుభక్తికి, ధైర్యశక్తికి నిదర్శనం నువ్వే.

**67.** **కీరితి దక్క, రాలు కరగించెడు చక్కని గాన విద్యయున్**
**తోరముగా వరించె నిను తుంబుర నారదులబ్రమందగన్**
**గారవమొప్పనీ మధురగానముతో నలరింపనత్తతిన్**
**వారు వినమ్ర బుద్ధి తలవంచిరి నీకు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! తుంబురనారదులు ఆశ్చర్యపడేటట్లుగా రాళ్ళను కరగించేగానవిద్య నీకు లభించింది. వారు నీ ముందు తలవంచారు.

**68.** **సరగున రామసత్కథను జానకి దు:ఖము వాయునట్లుగా**
**వరముగ పాడినావు తెలవారెను సీతముఖాంబుజమ్ము వి**
**స్ఫురదరుణాంశు జాలముల పూచె శుభోదయ మంగళ ధ్వనుల్**
**మరిమరి సందడించె ననుమానము వీడె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రాముని సత్కథను ఆలపించావు సీతముఖ పద్మం అరుణోదయ కిరణాలలో వికసించింది.

**69.** **ఏ ఫలమారగింప ప్రజకే ఫలితమ్మగునో మనోజ్ఞ సీ**
**తాఫలవృక్షమున్ గనగ ధాత్రిజ జ్ఞప్తికి వచ్చునట్లె రా**
**మా ఫలవృక్షమున్ కనగ మానిత రాముడు తోచునెంతయున్**
**ఆ ఫలరాజముల్ తానన నార్తి తొలంగు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! సీతాఫలవృక్షాన్ని చూస్తే సీత జ్ఞాపకం వస్తుంది. రామాఫల వృక్షాన్ని చూస్తే రాముడు గర్తుకు వస్తాడు. ఆ రెండు ఫలాలను ఆరగిస్తే ఆర్తి తీరుతుంది.

**70.** **భండనకేళిలో నపుడు పాండుతనూజలకండదండవై**
**యుండితివయ్య శాత్రవులనుక్కడగింప కపిధ్వజుండవై**
**గండములుండునే ప్రజకు గట్టిగ నీ పదమాశ్రయించుచో**
**మెండుగ నీ పదమ్ములను మేలుభజింతు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! యుద్ధంలో శత్రువులను అణిచేటట్లుగా కపిధ్వజుడువై పాండవులకు అండగా ఉన్నావు. నీ పాదాలను ఆశ్రయిస్తే ఆపదలు ఉండవు.

**71.** **కలగని యప్పుడే త్రిజట కాంక్షలు పుట్టగ నిద్రలేచెను**
**జ్వలరమణీయ భావనలు సందడిచేయ హృదంతరంబునన్**
**నలుదెసలందు మంచి శకునమ్ములు తోచెను సీతకష్టముల్**
**తొలగునటంచు పల్కెపరితోషముతోడ సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! అప్పుడే త్రిజట నిద్ర లేచింది. నాలుగు దిక్కుల్లో శుభశకునాలు తోచాయి. సీతకష్టాలు తొలగి పోతాయి అని సంతోషంగా చెప్పింది.

**72.** **శ్రీకరమైన రామవాక్కులను చిత్తము మీఱగ పల్కినట్టి వా**
**ల్మీకి పికానకున్ వినతి మేలుగ నేనొనరింతు పావనీ**

**ఆకవి సృష్టి రామకథయై జగమందున ఖ్యాతిగాంచెనా**
**నాకమనీయ ధార్మిక గుణంబులతోడ సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రామవాక్కులను పల్కినట్టి వాల్మీకి కోకిలానికి నేను నమస్కరిస్తాను. ఆకవి సృష్టి రామకథగా ప్రఖ్యాతి పొందింది.

**73.** **స్ఫురదురుపారిజాత తరుమూలమునందున మౌనమూర్తివై**
**నిరతమురామనామమును నీమము తోడ జపించు నట్టి వా**
**నరకుల దీపమా, నిను మనమ్మున నిల్పిన నీప్సితంబులి**
**ద్ధరనెరవేరు మర్త్యులకు దండిగ సామి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా!పారిజాత వృక్షమూలంలో మౌనంగా రామనామాన్ని జపించే వానరకుల దీపానివి నువ్వే.

**74.** **నేరమిరాక్షసాధములు నిప్పును బెట్టిరి నీదు తోకకున్**
**తీరుగలంక సర్వమును తృప్తిఘటిల్లగ కాల్చువేళ వి**
**స్తారదవానలుండు పరితాపము పెంచక శీతలుండునై**
**భూరిసుఖమ్ము నీకిడెను భూసుతవేడ సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! అవివేకంతో రాక్షసులు తోకకు నిప్పుపెట్టారు. నువ్వులంకను కాల్చేవేళ సీత ప్రార్థన వల్ల, అగ్ని దేవుడు నీకు శీతలంగా ఉండిగొప్ప సుఖాన్ని ఇచ్చాడు.

**75.** **భవనములన్ని తత్ప్రళయ భాస్కరలీల మహాగ్ని కీలలన్**
**తవులము కాగనత్తతిని దగ్ధములైనవి దానవ నాథువై**
**భవము నశించె నీ చటుల వాలము నెన్నవశమ్మె నీకసం**
**భవమను మాటలేదు కద వాయుకుమార సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! లంకలో భవనాలన్నీ దగ్ధమయ్యాయి. రావణాసురుని వైభవం నశించింది. నీకు అసంభవం అనే మాట లేదు.

**76.** **కోరికలూర కృష్ణుడు నిగూఢముగా రఘురాముడయ్యె తా**
**కోరికలూర రుక్మిణియు కోమల మంజుల సీతయయ్యె చె**
**న్నారగ వారి దర్శనమునందున సంతసమందినావులే**
**ద్వారక తానయోధ్యయయి ధన్యత గాంచె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! కృష్ణుడు రాముడయ్యాడు. రుక్మిణి సీత అయ్యింది. వారి దర్శనం నీకు సంతోషాన్ని కల్గించింది. ద్వారక అయోధ్య అయ్యింది.

**77. వాలముకాదులే యదియు భర్గుని మూడవ కంటిమంటయే**
**వాలము కాదుకాదు తలపన్ భృగురాముని ఖడ్గధారయే**
**వాలము కాదులే ప్రళయ భాస్వర భీకర రామబాణమే**
**వాలము కాదులే దనుజవైభవవైరి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! అదివాలం కాదు. ఈశ్వరుని కంటి మంట. భార్గవ రాముని ఖడ్గధార, ప్రళయ భయంకరమైన రామబాణం. రాక్షస వైభవానికి శత్రువు.

**78. రావణుడెంత భ్రష్టుడవురా పరదారను ముచ్చిలించె సు**
**గ్రీవుని మంత్రివైన నిను కేవల కీశునిగా దలంచె యా**
**కావరమెల్ల ద్రుంచితివిగౌరవనీయుని తద్విభీషణున్**
**తీవిగ బ్రోచినావు ప్రకటీకృత భక్తి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రావణుడెంత భ్రష్టుడో, పరస్త్రీని దొంగిలించాడు. సుగ్రీవుని మంత్రివైన నిన్ను సామాన్య వానరంగా భావించాడు. ఆ కావరాన్ని త్రెంచావు. గౌరవనీయుడైన విభీషణుని కాపాడినావు.

**79. ఘనమగులంకయందు పెనుగాలికి తూలిన పూలతీగలై**
**నినునెదిరించి రక్కసులు నెత్తురు క్రక్కుచు నీల్గినారు తా**
**ననుపమలీల మార్కొనుచు నక్షకుమారుడు చేరె నారకం**
**బును కపివీర నీ బలమమోఘము గాదె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! లంకలో పెనుగాలికి తూలిన పూలతీగల్లా నిన్ను ఎదిరించి, రాక్షసులునెత్తురు క్రక్కుకొని చచ్చారు. అక్షకుమారుడు నరకాన్ని చేరాడు.

**80. కోరికలాగకున్నయవి గుండెలలోన వికార భావముల్**
**సారెకు తోచుచున్నయవి సంపదపై మమకారమేర్పడెన్**
**ఘోరభవాంబురాశినెటు కూర్చితివో తరియింపశక్యమే**
**నారద వంద్య నీ స్మరణ నౌకయు లేక సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! కోరికలు ఆగటం లేదు. సంపదపై మమకారం పెరిగింది. నీస్మరణ అనే నౌక లేకుండా సంసార సాగరాన్ని దాటటం సాధ్యం కాదు.

**81.** **అన్నయధర్మశీలుడయి ప్రాణములన్‌విడనాడి పోయె య**
**న్నన్నవిభీషణుండు దనుజాన్వయమందున ధర్మశీలుడై**
**మిన్నగ రాజ్యమున్ గొనియె మేలును కీడును రెండు త్రోవలై**
**యున్నవిధర్మమొక్కటియె యోమును మీద సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రావణుడు అధర్మంగా ప్రవర్తించి ప్రాణాలను విడిచాడు. విభీషణుడు ధర్మాత్ముడై రాజ్యాన్ని పొందాడు. మంచిచెడు అనే రెండు మార్గాలున్నాయి. భవిష్యత్తులో రక్షించేది ధర్మం ఒక్కటే.

**82.** **తీపి మిఠాయి తిన్న పరితృప్తి ఘటిల్లును నీకు నిచ్చులున్**
**తీపిమిఠాయి కన్నకదుతీయని కైతల లడ్డు లిచ్చెదన్**
**కోపమికేల కోరినవి కొంచక దాచకయారగింపు మీ**
**ప్రాపొకటే మహాబలము వాక్పతి వంద్య సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీకు తీపి మిఠాయి అంటే చాలా ఇష్టం. తీపి మిఠాయి కన్నా తీయనైన కవితలు అనే లడ్డూలు ఇస్తాను. కోరినవి దాచుకోకుండా తిను.

**83.** **సురగుణసేవ్యమానగు సుందరకాండకు నీవె యండ సుం**
**దరమగు భావనావళులు ధారుణి కన్యకలంకరించి భీ**
**కరముగ దైత్యులన్ దునిమి కౌతుక మేర్పడ రామకార్యమున్**
**స్థిరమతి పూర్తి జేసిన విశిష్టుడవీవె సువర్చలేశ్వరా!**

భావం : సుందరకాండకు నీవె అండ. అందమైన భావాలను సీతకు అందచేసి, రాక్షసులను చంపి, రామకార్యాన్ని నెరవేర్చిన మంచివాడివి నువ్వే.

**84.** **క్షీరపయోధికన్యరమ సీతవలెన్ ప్రభవించి జన్మసం**
**స్కారముతోడ రాఘవుని సన్నిధి జేరె జగద్ధితార్థమై**
**వారల పుట్టువుల్ పాపభరంబును తీర్చదానికే**
**వారికి బంటు వీవగుచువర్ధిలినావు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! లక్ష్మీసీతలా పుట్టి శ్రీరాముని సన్నిధి చేరింది వారి పుట్టుకలు పాపభారాన్ని తీర్చడానికీ వారికి సేవకుడవై నీవు వర్ధిల్లావు.

**85.** **అస్త్రము నిన్ను వంచగలదా కుపితుండయి యింద్రజిత్తుబ్ర**
**హ్మాస్త్రము వేయ మూర్ఛగొనినట్లు నటించి సభన్ దశాననున్**
**వస్త్రవిభాసితున్ బరమ శంకర భుక్తునిగాంచి మెచ్చవే**

**శస్త్రములెవ్వియున్ గెలువ జాలవు నిన్ను సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! ఇంద్రజిత్తు అస్త్రం వేయగా, మూర్ఛపొందినట్లు నటించి, శంకర భక్తుణ్ణి, రావణాసురుణ్ణి చూచి మెచ్చుకున్నావు. ఏ శస్త్రాలు నిన్ను గెలువలేవు.

**86.** **సురుచిరశోభనాంగియగుసూర్యకుమారి సువర్చలాఖ్యయున్**
**మెరయగ నీకు పత్నియయి మేదిని కీర్తి గడించెనెంతయున్**
**అరయగ మీదు దంపతికి నంజలులన్ఘటియింతు ముగ్ధసుం**
**దరవదనారవిందజిత దానవ బృంద సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! సూర్యుని పుత్రిక 'సువర్చల' నీకు భార్యయై కీర్తి గడించింది. మీ దంపతులకు నమస్కరిస్తాను.

**87.** **ఘనతరవజ్రఘాతమున కన్గొన చక్కని నీదు దౌడయున్**
**కనలేనదేమి చోద్యమొజగద్ధితమై తనరారెనద్ది శ్రీ**
**హనుమగఖ్యాతి గాంచితివి యందరు నిన్ను నుతించునట్లుగన్**
**వినమధురమ్మునీ చరిత వీరవతంస! సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! ఇంద్రుని వజ్రఘాతానికి (దెబ్బకు) నీ దౌడ కమిలిపోయింది. అప్పట్నుంచి శ్రీహనుమగా ఖ్యాతిగాంచావు.

**88.** **రాముని మంగళప్రదుని రంజిత మూర్తివినీల నీరద**
**శ్యామునిధర్మశీలుని గుణాత్ముని నిర్మల జానకీ పతిన్**
**భీమపరాక్రమున్ నిగమ వేద్యుని గొల్తువనన్య భక్తితో**
**నీ మహనీయ శక్తి యదె నీ సరిలేరు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! మంగళప్రదుణ్ణి, నీలమేఘశ్యాముణ్ణి, ధర్మశీలుణ్ణి,గుణాత్ముణ్ణి జానకీ దేవి భర్తను, నిగమవేద్యుడైన రాముణ్ణి భక్తితో కొలుస్తావు. నీ శక్తి అదే నీకు సాటిలేరు.

విశేషాంశం : ధర్మమే (విల్లు) శీలంగా కలవాడు
గుణమే (వింటినారి) ఆత్మగా కలవాడు. రాముడు

**89.** **దారుణదంష్ట్రలన్ గలుగు దానవులెత్తిన వేళ భీకరా**
**కారము దాల్చి నీవు పెనుకాయముతోనభమంటి పెద్దహుం**
**కారముసేయ నాఖలులు గ్రక్కున రక్తము గ్రక్కిచావరే**
**శూరవరేణ్య! నీ పటిమచూడ వశమ్మె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! భయంకరమైన కోరలు కల్గిన రాక్షసులు దండెత్తి నప్పుడు నీవు శరీరాన్ని పెంచిపెద్ద హుంకారం చేస్తే ఆ దుర్మార్గులు రక్తం క్రక్కి చస్తారు.

**90.** **అనితరసాధ్యమైనపనినాదట చేయగలట్టి వాడవీ**
**వనినెరనమ్మి సూర్యసుతుడయ్యెడ సీతను వేగ చూచిర**
**మ్మని పనుపన్ మహాత్మతనుజాధిపుకీర్తి కిరీటమైనలం**
**కనుగని కాల్చివచ్చితివి గంతులువైచి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! సుగ్రీవుడు సీతను చూచి రమ్మని పంపితే నీవు లంకను కాల్చి వచ్చావు.

**91.** **దాసుడవయ్యరామునకు దాసుడవయ్య సుమిత్ర సూతికిన్**
**దాసుడవయ్య నిర్మల సుధాభరితమ్మగు రామభక్తికిన్**
**దాసుడయ్య భూసుతకు ధర్మికి దాసుడవయ్య అంజనా**
**కేసరి పుత్ర! వందనము కీశకులేశ! సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రామునకు దాసుడవు, లక్ష్మణునకు దాసుడవు రామభక్తికి దాసుడవు, సీతకు దాసుడవు. ధర్మజ్ఞుడికి దాసుడవు.

**92.** **చూచితిసీతనంచని విశుద్ధ వచస్సుధ క్రుమ్మరించుచున్**
**వేచిన రామ భద్రునకు వేడుక నింపితివయ్య మారుతీ**
**నీ చతురత్వమున్ బొగడ నీరజగర్భునకైన శక్యమే**
**నీ చరితంబు పాడుదువినిర్మల భక్తి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! 'చూశాను సీతను' అని వచనామృతం కురిపించి రాముడికి ఆనందాన్ని పంచావు.

**93.** **శివుని పదారవిందములు చిత్తములో నెలకొల్పి పేర్మిసం**
**స్తవ మొనరించు భక్తుడు ప్రసన్న శివస్తుతి జేసినట్టు దా**
**నవకుల సార్వభౌముడు వనమ్మునసీతను దాచిపెట్టివై**
**భవమును కోలుపోయె విధివంచితుడయ్యె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! శివుని పాదపద్మాలు మనస్సులో నిలుపుకున్న భక్తుడు శివస్తుతి చేసినట్టి రావణుడు సీతనుదాచి, వైభవాన్ని కోల్పోయాడు.

**94.** **నీతినిపాతి పెట్టియవినీతికి పాల్పడు వారలీభువిన్**
**భూతిని ప్రోది చేసికొని పుణ్యపదమ్మును వీడిరక్కటా**
**నీతికి ద్వారముల్ దెరిచి నిర్మల కాంతి వితానజీవన**
**జ్యోతులు వెల్గజేయుము విశుద్ధ చరిత్ర సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! అవినీతి పరులు సంపదను పెంచుకొని దివ్యమైన మోక్షాన్ని విడిచి పెట్టారు. నీతికి ద్వారాలు తెరిచి, నిర్మలమైన జీవనజ్యోతులు వెలిగింపుము.

**95.** **నిరుపమ బుద్ధి వైభవము నిన్ను వరించె వరప్రసాదమై**
**సరసవచో విలాసముప్రసన్నగభీరమన: ప్రవృత్తియున్**
**బరమపరాక్రమ స్ఫురిత పాటవమున్ మిగులంగ నీయెడన్**
**విరివిగ సందడించె పృథివీసురవంద్య సువర్చలేశ్వరా!**

భావం: సువర్చలేశ్వరా! బుద్ధి వైభవం నీకు వరప్రసాదం.వచోవిలాసం గంభీరమైన మనస్సు, పరాక్ర పాండిత్యం నీలో సమృద్ధిగా ఉంది.

**96.** **రాముని పాదపద్మములు రాత్రిని సైతము వీడనట్టి నీ**
**ప్రేముడికంజలింతు కపివీర, భవత్పరిసేవనంబు లో**
**రాముడు మంగళ ప్రదుడు రాజిత సత్కరుణాంచితుండునై**
**క్షేమము గూర్చుచుండె జనజీవన మొప్ప సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రాముని పాదపద్మములు రాత్రివేళలో కూడా వీడని నీ ప్రేమకు నమస్కారం. నీసేవలో రాముడు కరుణాళువై జనులకు క్షేమాన్ని కూరుస్తున్నాడు.

**97.** **వనరవీరనీ విమలశాలము భూతికినావాలమై**
**దానవ గర్వభంగమయి ధర్మనిరూపణమై ప్రశస్తమై**
**మాన ధనాగ్రగణ్యమయి మంజుల రామపదావలంబమై**
**జ్ఞానకళావిలాసమయి సన్నుతికెక్కె సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీతోక (వాలము) సంపదకు పాదై, రాక్షసులకు గర్వభంగమై, ధర్మానికి ఋజువై అభిమానధనంలో సాటి లేనిదై రాముని పాదాలను ఆశ్రయించే దైవజ్ఞానానికి దిక్కై కీర్తికెక్కింది.

**98.** **కాలముమారిపోయె కలికాలము వచ్చెను వింతలెన్నియో**
**హేలగ సాగుచున్నవి కపీశ్వర నీకును జెప్పనేటికిన్**
**వాలముద్రిప్పి పిడివాదములన్ దుదముట్ట జేసి స**
**త్యాలకు ద్వారముల్ తెరువు తాపమడంగ సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! కలికాలం వచ్చింది. ఎన్నో వింతలు జరుగుతున్నాయి. నీవాలంతో (తోక) పిడివాదాలను త్రిప్పి కొట్టి సత్యాలకు తలుపులు తెరువుము.

**99.** **తమ్ముడు మూర్ఛనొంద పరితాపము నొందుచు రాఘవుండుధై**
**ర్యమ్మును కోలుపోవుతతినారయ నోషధిశైలమొక్కెడన్**
**గమన్నతెచ్చి లక్ష్మణుని గాచిన నీచరితమంబు పాడమో**
**దమ్ముజనించు నెల్లరకు దైత్యవిదార!సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! తమ్ముడు లక్ష్మణుడు మూర్ఛనొందినప్పుడు రాముడు ధైర్యాన్ని కోల్పోతే, సంజీవిని పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుని ప్రాణాలను కాపాడిన నీ చరిత్ర ఆనందదాయకం.

**100.** **చదువులసారమున్దెలియస్రష్టకునైనవశమ్మెస్వామి యా**
**చదువునునిష్ఠగా గరచి చక్కని చిక్కని పండితుండవై**
**సదమలకీర్తినొందితివి స్వాదురసామల వాక్యరీతికిన్**
**పదనగు సాక్ష్యమీవె బుధవర్య! కపీశ! సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! చదువుచాలా గొప్పది. ఆ చదువును నిష్ఠగా అభ్యసించి గొప్ప పండితునిగా కీర్తిని ఆర్జించావు. బాగా మాట్లాడడానికి నువ్వే సాక్ష్యం.

**101.** **ఏవిధియడ్డమైన మదినింతయు ఖేదము నొందలేదు నీ**
**జీవితమెల్ల రామపదసేవకునంకిత మయ్యెఘోరమై**
**రావణుగూర్చి రామునకు లక్ష్మణమూర్తికిమోదమిచ్చితే**
**పావనమయ్య నీ చరిత వాయుకుమార సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీ జీవితంతా రామపాద సేవకు అంకితమైంది. మైరావణుని చంపి, రామలక్ష్మణులకు సంతోషాన్ని ఇచ్చావు.

**102.** **మానమునేర్చికైన నభిమానము పెంచును సాటిలేని స**
**న్మానము ఖ్యాతిపెంచునవమానము ఖ్యాతిని గూల్చివేయు వి**

**జ్ఞానము నాత్మశక్తినిడు సర్వశుభంకరమైన నీతపో**
**ధ్యానము చింత దీర్చి విజయంబులు కూర్చు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! సన్మానం ఖ్యాతిని పెంచుతుంది. అవమానం ఖ్యాతిని కూల్చి వేస్తుంది.విజ్ఞానమును ఆత్మశక్తిని ప్రసాదించే నీధ్యానం చింత తీర్చి విజయాలను సకూరుస్తుంది.

**103.** **వానరశేఖరా!నిఖిల పండిత మండిత! నీకథావళిన్**
**నేనుదలంతు నిచ్చలును నీఘనకార్యములన్ బఠింతువి**
**జ్ఞానముగోరి నీచరణ సన్నిధి నిల్చితినయ్యవేగనా**
**నానవనీత భావనలు నాట్యమొనర్ప సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! పండితశ్రేష్టా నీ కథలను నేను తలుస్తాను. నీ ఘనకార్యాలను పఠిస్తాను. నాకు మంచి భావాలు కలిగేటట్లుగా నీ పాదాల దగ్గర నిలబడ్డాను.

**104.** **అంగదుదుబ్బ సూర్యసుతుడబ్బురమంద సుమిత్ర పుత్రుడన్**
**పొంగగ, వానరోత్తములు ముద్దుగ గంతులువైచుచుండ ప్ర**
**త్యంగము స్పర్శతోడ పులకాంకితమైతనివోవ, రామునా**
**లింగన భాగ్యమున్ గొనిన, లెంకవు నీవెసువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! అంగదుడు, సుగ్రీవుడు, లక్ష్మణుడు వానర ప్రముఖులు ఆనందిస్తుంటే రాముని ఆలింగన భాగ్యాన్ని పొందావు.

**105.** **హనుమనినున్ భజించిన రసానుభవంబలరారుజ్ఞానికిన్**
**హనుమనినున్ నుతించిన మహాకవికబ్బును శబ్దసంపదల్**
**హనుమనినున్ దలంచినమహాద్యుతి వెల్గును గుండెలందునన్**
**హనుమగ్రహింపు పద్య కుసుమార్చన మింక సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నిన్ను పూజిస్తే జ్ఞానికి రసానుభవం కలుగుతుంది. మహాకవికి శబ్దసంపదలు దక్కుతాయి. తలిస్తే గొప్పకాంతి గుండెల్లో వెలుగుతుంది. ఈ పద్య కుసుమార్చన స్వీకరింపుము.

**106.** **మరులను సృష్టి చేసియభిమానము దానికి రంగరించి అ**
**స్థిరమగు జీవమున్ మెరయ జేసి కళత్ర, తనూభవాదులన్**
**సరసతమాల గ్రుచ్చి భవసాగర మందున ప్రాణి కోటినిన్**
**మరియుచు ముంచుచుంటివి విముక్తినొసంగు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! భార్యాబిడ్డలు మొ॥ వాటిని మాలగా గుచ్చి ప్రాణికోటిని భవసాగరంలో ముంచుతున్నావు. మోక్షం ప్రసాదించు.

**107.** **పచ్చని పచ్చడంబుమెయి వర్ధిలు చుండ గదాధరుండవై**
**పచ్చలహారముల్ మెరయ బాహుబలైక శరీరకాంతితో**
**నచ్చపుఠీవిపెంపెసగనంజన పుత్రకటాక్ష పంక్తితో**
**మెచ్చువె, రాభక్తులను మేలుఘటిల్ల సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! పచ్చని పట్టువస్త్రం శరీరం మీద ఒప్పుతుంటే గదను ధరించిన వాడవై పచ్చల హారాలు మెరుస్తుంటే శరీరకాంతితో ఠీవితో, కటాక్ష సమూహంతో మేలు కలిగేటట్లుగా రామభక్తులను మెచ్చుకుంటావు.

**108.** **స్వస్తినిబల్కు సత్కవికి స్వస్తిని బల్కుము కర్షకాళికిన్**
**స్వస్తినిబల్కు విప్రులకు స్వస్తిని బల్కుము జీవపాళికిన్**
**స్వస్తినిబల్కు లేమలకు స్వస్తిని బల్కుము పండితావళికిన్**
**స్వస్తినిబల్కు మెల్లరకు సత్కృపతోడ సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేవ్వరా! కవికి, కర్షకులకు, బ్రాహ్మణులకు, జీవశ్రేణికి, స్త్రీలకు, పండితులకు అందరికీ శుభాన్ని పల్కుము.

**109.** **మారుతి నీ పద్మములను మర్మమెఱింగియు పట్టువారికిన్**
**మారుతినీగుణమ్ములను మర్మమెఱింగి పఠించువారికిన్**
**మారుతి నీజవంబును క్రమమ్ముగ పేర్మి తలంచు వారికిన్**
**భారములన్నియున్ దొలగి భద్రములొప్పు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీ పాదాలు పట్టేవారికి నీ గుణాలను పఠించే వారికి నీ వేగాన్ని గమనించే వారికి భారాలన్ని తొలగిపోయి శుభాలు కలుగుతాయి.

**110.** **పెరిగెను హీనకృత్యములు విశ్వములెల్లెడ దద్దరిల్లగన్**
**పెరిగెను మానభంగములు భీతిని చెందిరి మానినీమణుల్**
**తఱిగెను శాంతి భద్రతలు దానవభంజనలెమ్ముపృథ్వియున్**
**సురుచిరలీల కావలయును సుందరకాండ సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రాక్షస కృత్యాలు పెరిగాయి, మానభంగాలు పెరిగాయి, శాంతి భద్రతలు నశించాయి, లోకం సుందరకాండ కావాలి లేవయ్య.

**111.** **రాగములెన్నియో కలవురాగములందలి యంతరార్థముల్**
**ఆగమవంద్యనీకెఱుక యావిలలైన కరుంగు నీవు స**
**ద్యోగముతోడపాడు తతి తుంబుర నారదులంజలింపరే**
**రాగసుధానిధీ, స్వర విలాసవినోది సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! రాగాలలోని అంతరార్థం నీకు తెలుసు. నువ్వుగానం చేస్తే శిలలు కరుగుతాయి. తుంబుర నారదులే నీకునమస్కరించారు.

**112.** **కనుగొనధారుణీస్థలిని కాలము లెన్నొగతించిపోయెనీ**
**వనయమునన్ని కాలముల యందలరారెడు చిత్తవృత్తులన్**
**సునిశిత బుద్ధితోరనయు సూరివరేణ్యుడవేమి చెప్పుదున్**
**మనుగడ కూల్చివైచె, నధునాతనశైలి సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! ఈలోకంలో కాలాలెన్నో గతించిపోయాయి. ఆ కాలాల్లో వుండే చిత్తవృత్తుల్ని పరిశీలించే పండిత శ్రేష్టుడివి. అధునాతన పద్ధతి మనుగడ కూల్చింది.

**113.** **సిరులకు బద్ధులై నరులు జీవనమున్ బొనరింతు రక్కటా**
**సిరులను మూటగట్టుకొని చేరిరెనాకముతాతతండ్రులున్**
**సిరిని భజించుచున్ బరము చింతన సేయరిదేమి చోద్యమో**
**సిరివరుసేవ కాగ్రణి భజింతును నిన్ను సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! తాతతండ్రులు ధనాన్ని మూటగట్టుకొని స్వర్గానికి వెళ్లలేదు. మానవులు మోక్షాన్ని విడిచి పెట్టి, ధనాన్ని పూజిస్తున్నారు. ఇదెక్కడి వింతో.

**114.** **అలముసేయ శాత్రువులనాఅడి బెట్టెదు పాండవుండునీ**
**వాలము నెత్తలేక కదుబన్నమునొందె విచిత్ర మేర్పడన్**
**మ్రొలనమస్కరించి కపిముఖ్యునిగా కనిపెట్టి పెక్కుచం**
**దాల నుతించె నిన్నుజని ధన్యతనంద సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీ తోకను ఎత్తలేక భీముడు ఇబ్బంది పడ్డాడు. నిన్ను ఆంజనేయునిగా గ్రహించి, అనేక విధాలుగా కీర్తించాడు.

**115.** **మానుషవేషధారివయి మంగళతేజులు రామలక్ష్మణుల్**
**జ్ఞానకళావతంసయని సన్నుతి చేయగ సన్ముదాక్తులన్**
**దీనశరణ్య! చెప్పితివి దివ్యమహత్వపటుత్వ సంపదల్**

**నీనగుమోములో నిలిచి నృత్యమొనర్ప సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! మానవ రూపంలో చక్కగా మాట్లాడి 'జ్ఞానకళావతంస' అని రామలక్ష్మణుల చేత పొగడబడ్డావు.

**116. నిరతమునీకథావళిని నెమ్మిదలంతునఖండశక్తితో**
**నిరతము నీ పదాబ్జములు నేర్పుమెయిన్ భజియింతురక్తితో**
**నిరతమునీదు నామమును నిశ్చల బుద్ధి జపింతుసక్తితో**
**నిరతము శక్తితోనెగడనిన్నునుతింతు సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నిరంతరం నీ కథలను తలుస్తాను. నీ పాదాలను పూజిస్తాను. నీ నామాన్ని జపిస్తాను. బలం కోసం కీర్తిస్తాను.

**117. వానరయూథముఖ్యుడవు బాహుబలమ్మునలంకలోపలన్**
**దానవ యోధులన్ దునిమి తల్లడ మందగ రావణుండు నెం**
**తేనయ శాలివై యినకులేశుని శక్తిని చాటినావు వి**
**జ్ఞానవరిష్ఠ తీర్చితివి జానకి చింత సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! బాహుబలంతో లంకలో దానవ వీరుల్ని సంహరించి రావణుడు భయపడేటట్లు రామునిశక్తిని ప్రదర్శించావు. సీతకు బాధ తీర్చావు.

**118. మంగళమయ్యనీకు శుభమంగళమయ్య శివాంశ సంభవా**
**మంగళమయ్యనీకు జయమంగళమయ్య సమీరనందనా**
**మంగళమయ్యనీకు నవమంజుల కోమల వానరోత్తమా**
**మంగళమయ్యనీకు పృథుమంగళమయ్య సువర్చలేశ్వరా!**

భావం : సువర్చలేశ్వరా! నీకు మంగళము,శుభ మంగళము, నీకు జయమంగళము, నీకు విస్తార మంగళము.

## నా గురించి



| | | |
|---|---|---|
| పేరు: | | మంకు శ్రీను |
| విద్య | : | ఎం.ఏ.తెలుగు |
| వృత్తి | : | స్కూల్ అసిస్టెంట్ తెలుగు |
| ప్రవృత్తి | : | రచనా వ్యాసాంగం, పుస్తక పఠనం |
| బి.ఎ.ఓఎల్ | : | క్షీరా రామలింగేశ్వర స్వామి సంస్కృత కళాశాల, పాలకొల్లు |
| ఎమ్.ఏ | : | ఆంధ్రాయూనివర్సిటీ |
| సాహిత్యగురువు | : | గురుసహస్రావధాని డా॥ కడిమిళ్ళ వరప్రసాద్ |
| రచనలు | : | శ్రీరామలింగేశ్వర శతకం<br>రాజరాజేశ్వరి త్రిశతి<br>తాండవ గీతం<br>శ్రీ వినాయక శతకము<br>మయూర వాహన శతకము<br>శ్రీ సువర్చలేశ్వర శతకము |
| అముద్రిత రచనలు: | | ప్రణయ సుందరి<br>సమస్యాపూరణ పద్యాలు<br>ఖండకావ్యం |
| తల్లిదండ్రులు | : | మంకు సూర్యావతి,<br>నాగాచార్యులు(లేటు) |
| చిరునామా | : | కొప్పర్రు-534275<br>నర్సాపురం మండలం, ప॥గో॥జిల్లా.<br>సెల్ : 8985990215 |



















